క్లుప్తంగా

స్వామి సేవలో రిటైర్డ్ కలెక్టర్



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కృష్ణా జిల్లా రిటైర్డ్ కలెక్టర్ లక్ష్మీకాంతం దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

శ్రీరామ శోభాయాత్రలకు భక్తులు తరలిరండి

పెడన: జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఆరుచోట్ల నిర్వహించే శ్రీరామశోభాయాత్రకు భక్తులు తరలిరావాల్సిందిగా హిందూ చైతన్య వేదిక కృష్ణా జిల్లా అధ్యక్షుడు నాందేడ్ల కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం, గుడివాడ, పామర్రు, గన్నవరం, తేలప్రోలు, బందరు మండలం చిన్నాపురంలలో జరిగే ఈ శోభాయాత్రలతో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ

మచిలీపట్నంటౌన్: భారత మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక 31వ డివిజన్ శారదానగర్‌లో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఫిషర్‌మెన్ సొసైటీ అధ్వర్యంలో ఆ డివిజన్ కార్పొరేటర్ యంత్రపాటి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్, మాజీ పీపీ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్‌లు చీరలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎం.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ దివి జనరల్ సెక్రటరీగా సుమన్

నాగాయలంక: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) దివి యూనిట్ జనరల్ సెక్రటరీగా నాగాయలంక మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వర్రే సుమన్ ఎన్నికయ్యారు. అవనిగడ్డలో శనివారం నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సనకా జనార్ధనరావు అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు చెప్పారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

మోపిదేవి:ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించాలని కేవీకే ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. బాపట్ల వ్యవసాయకళాశాల విద్యార్థులు కేవీకే ఆధ్వర్యంలో జాతీయ సేవ పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం ఎన్ఎస్ఎస్ నేతృత్వంలో పలుప్రభుత్వ కార్యాలయాలు, పరసరాలను శుభ్రం చేశారు. డాక్టర్ ఎం.సంధ్య, డాక్టర్ బి.అపర్ణ మాట్లాడారు. గ్రామంలో ప్లేకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రావ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

పోతేపల్లి (మచిలీపట్నం రూరల్):విజయ కనకదుర్గ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవాలయం 13 వార్షికోత్సవం సందర్భంగా శనివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాగిత ఏడుకొండలు ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం 3000 మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సంస్కృత అధ్యాపకులు గోవిందరాజులుకు సత్కారం

మచిలీపట్నంఅర్బన్: సాహిత్య విభాగంలో అధ్యాపకులు కొలుసు గోవిందరాజులుకు తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామభద్రదీక్షితస్యసాహిత్యమంజర్యా విమర్శనాత్మకమధ్యమనమ్ అనే అంశంపై సాహితీవేత్త, పరిశోధన, ప్రచురణ విభాగానికి చెందిన విశ్రాంతాచార్యులు సీహెచ్‌పీ సత్యనారాయణ మార్గదర్శకత్వంలో పరిశోధన సమర్పించినట్లు చెప్పారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యంపై కేసు నమోదు

పెడన:పట్టణానికి చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. 16వ వార్డుకు చెందిన వి.నాగేశ్వరరావు కుమార్తె వాకాలమ్మ తన పిల్లలు సాయిశివ, ప్రజ్ఞతో ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదు. వాకాలమ్మకు మచిలీపట్నం మాచవరం మెట్టుకు చెందిన నాగరాజుతో వివాహమైంది. కుటుంబ గొడవల నేపథ్యంలో తండ్రి వద్దకు 2022లో వచ్చేసింది. అప్పటి నుంచి తండ్రి వద్ద ఉంటుంది. బంధువులు, స్నేహితులు వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో నాగేశ్వరరావు పెడన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిర్లక్ష్యపు నీడలో మున్సిపల్ దుకాణాలు

- పిచ్చిమొక్కలకు నిలయాలుగా మారుతున్న వైనం
- 59 దుకాణాలకు 32 మాత్రమే నడుస్తున్న దుస్థితి
- ఆదాయంపై దృష్టి పెట్టని పురపాలక అధికారులు
- దుకాణాలు ఎదురుగా సబ్‌లీజుదారులతో ఆక్రమణలు



బంటుమిల్లి రోడ్డులోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

పెడన: పురపాలక సంఘానికి ఆదాయం వచ్చే మార్గాలున్నా ఆ దిశగా అధికారులు అడుగులు ముందుకు వేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. పాలకవర్గ సభ్యులకు పరిస్థితి తెలియజేయాల్సిన అధికారులు తమకు ఏమీ పట్టనట్లుగా నడుచుకోవడం విడ్డూరంగా ఉంది. పురపాలక సంఘానికి చెందిన ఐదు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉన్నటువంటి ఈ కాంప్లెక్స్‌లలో 59 దుకాణాలకు కేవలం 32 మాత్రమే అర్హులైన వారికి లీజుకు ఇచ్చారు. మిగిలినవి ఖాళీగా ఉంటున్నాయి. అందుకు కారణం ఆయా షాపింగ్ కాంప్లెక్స్‌లు శిథిలావస్థకు చేరుతుండటం, పిచ్చిమొక్కలకు నిలయంగా మారుతుండటం, కనీస సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాలు వల్ల ఉన్న లీజుదారులు కూడా ఖాళీ చేసి వెళ్లిపోవడానికి సిద్ధపడుతున్నారంటే పరిస్థితి అర్థమవుతుంది. అదీ కాకుండా పలు షాపింగ్ కాంప్లెక్స్‌లు వద్ద ఆక్రమణదారులు అధికమవుతున్నా మున్సిపల్ అధికారులు వాటిని తొలగించడానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, చెప్పిచెప్పి విసుగుచెంది మిన్నకుండిపోవడం లీజు గడువు పూర్తవ్వగానే ఖాళీ చేయడం పరిపాటిగా మారింది.

ఆదాయం సగానికి సగం పడిపోయింది....

ఐదు కాంప్లెక్స్‌లు ద్వారా మున్సిపాలిటీ ఆదాయం బాగా పడిపోయింది. వాస్తవంగా 59 దుకాణాలు ద్వారా సుమారు రూ.30 లక్షలు నుంచి రూ.35 లక్షలు వరకు వచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఏడాదికి రూ.19 లక్షలు మాత్రమే వస్తుండటం విశేషం. వాటిని బాగు చేయిస్తే ఆదాయం పెరుగుతుందని పలువురు మొరపెడుతున్నా పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఐదు కాంప్లెక్స్‌లలో మూడు దారుణం....

పట్టణంలో ఐదు మున్సిపల్ కాంప్లెక్స్‌లున్నాయి. మహాత్మగాంధీ కాంప్లెక్స్, పాతకూరగాయాల మార్కెట్ వద్ద ఒక కాంప్లెక్స్, బంటుమిల్లి రోడ్డు సెంటరులో మరొక కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్డులోని మహిళా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, కొత్తపేటలోని షాపింగ్ కాంప్లెక్స్. ఈ ఐదు కాంప్లెక్స్‌లలో కనీసం వాష్‌రూమ్స్ లేక లీజుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతకూరగాలయ మార్కెట్ వద్ద ఉన్న దుకాణాల దుస్థితి గోడలకు పిచ్చిమొక్కలు పెరిగి పెద్దవి అవుతున్నా పట్టించుకోవడం లేదు. లీజుదారులు సైతం చూసి చూడనట్లుగా నడుచుకుంటున్నారు. బంటుమిల్లి రోడ్డులోని షాపింగ్ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్డులోని మహిళా షాపింగ్ కాంప్లెక్స్‌లు సైతం శిథిలావస్థకు చేరుతున్నాయి. కనీసం మరమ్మతులు చేయించి వాష్‌రూమ్స్ ఏర్పాటు చేస్తే లీజుదారులు వచ్చే అవకాశం ఉండటంతో మున్సిపాలిటీ ఆదాయం కూడా గణనీయంగా పెరగడానికి ఛాన్స్ ఉన్నాయనేది పాలకులే పేర్కొంటున్నారు.

కౌన్సిల్‌లో పెట్టి మరమ్మతులు చేయిస్తాం



మున్సిపల్ కాంప్లెక్స్‌లు కొన్ని శిథిలావస్థకు చేరుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అలాగే అన్ని కాంప్లెక్స్‌లలో కూడా వాష్ రూంలు లేవు. ఈ విషయమై చాలా సార్లు లీజుదారులు లిఖితపూర్వకంగా తెలియజేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ విషయాలపై కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేయించి వాష్‌రూంలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. పిచ్చి మొక్కలను తక్షణం తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తా.

ఎం.గోపాలరావు,
కమిషనర్, పురపాలక సంఘం, పెడన

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కృష్ణా వర్సిటీ వీసీ రాంజీ భేటీ



మచిలీపట్నంరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.రాంజీ శనివారం మర్యాద పూర్వకంగా కలిసారు. వెలగపూడి సచివాలయంలో ఆయనను కలిసి విశ్వవిద్యాలయం అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. భవిష్యతలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందించి సత్కరించారు.

నేటి నుంచి హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో కొలువై ఉన్న సువర్చలాంజనేయస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి నుంచి హనుమజ్జయంతి వరకు హనుమాన్‌చాలీసా పారాయణం ఆదివారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు అర్చకులు ఆర్.హనుమంతాచార్యులు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా దాదాపు 47 రోజులపాటు చాలీసా పారాయణం చేస్తున్నామని చెప్పారు. ఈ నెల ఆరవ తేదీ నుంచి మే 22 వరకు ఉదయం 6 గంటల నుంచి జరగనున్న పారాయణ మహా యజ్ఞంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా కళాశాల వార్షిక వేడుకలు



పెడన:మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 17వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించినారు. ముఖ్య అతిధి పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గద్దం పద్మజారెడ్డి మాట్లాడుతూ నేడు సాంకేతిక విద్య మారుమూల గ్రామాలకు సైతం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. బీటెక్ డిప్లొమా ప్రిన్సిపాల్స్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, ఎస్‌కేవీ ప్రసాద్‌లు తమ కళాశాల వార్షిక నివేదికలు వివరించారు. కళాశాల చైర్మన్ జి.మెహెర్ ప్రసాద్, సెక్రటరీ టి మెహెర్ బాబా, కరెస్పాండెంట్ కె కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దోసపాటి బాబా, టి సాయికుమార్, విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

వక్కలగడ్డ(చల్లపల్లి): ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పంపిణీ చేశారు. ఐవీఎం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డాక్టర్ వేములపల్లి సురేష్– రోజా దంపతులు సమకూర్చిన రూ.రూ.1.80 లక్షల విలువగల కుట్టుమిషన్లను అందజేశారు.

జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

కోనేరుసెంటర్: జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు శనివారం శ్రీరామనవమి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోరారు. ప్రజలకు సీతారాముల ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అలాగే పోలీసు కుటుంబాలు పోలీసు రామాలయంలో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని సూచించారు.

చర్చిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఘంటసాల: అన్ని చర్చిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి పాస్టర్లను కోరారు. ఘంటసాల పోలీస్ స్టేషన్‌లో మండలంలోని పాస్టర్లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల శ్రీకాకుళం శివారు శీలం వారిపాలెం రామాలయంలో దొంగతనం జరగ్గా సమీపంలోని సీసీ కెమెరా ఉండటంతో వారిని గుర్తించి అరెస్టు చేశామన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్

పెడన:అణగారిన వర్గాల ఆశాజ్యోతి, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగజ్జీవన్ రామ్ అందించిన సేవలు నేటి సమాజానికి ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ బాబుజగజ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా అందరికీ సమన్యాయం చేసేలా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుచుకున్నారని గుర్తు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌తో కౌన్సిలర్ సతీష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు తదితరులు పూలమాలలు వేసి నివాళుర్పించారు.

దీనజన బాంధవుడు జగ్జీవన్‌రామ్

మచిలీపట్నంటౌన్: దీనజన బాంధవుడు బాబు జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన బైక్‌లపై ర్యాలీగా బయలుదేరి మల్కాపట్నంలోని గుప్తాసెంటర్, ఉల్లింగిపాలెం, ఓగీస్‌పేట, శారదానగర్‌లలోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఉల్లింగిపాలెంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలసి కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, యండ్రపాటి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి వరప్రసాద్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పార్టీ మండల నార్త్ అధ్యక్షుడు మట్టా నాంచారయ్య, మాజీ కౌన్సిలర్‌లు కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, గూడవల్లి నాగరాజు తదితరులున్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ప్రముఖుల నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలోని మల్కాపట్నం గుప్తా సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సర్వజన ఆస్పత్రి నేత్ర విభాగాధిపతి డాక్టర్ జి.భానుమూర్తి, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్ దేవలపల్లి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఎస్సీ సంఘాల నాయకులు మాచవరపు ఆదినారాయణ, కొడాలి శర్మ, డొక్కా జగన్మోహనరావు, గంధ్రపు సీనయ్య మాస్టార్, వంపుగడుపుల చౌదరి, పి.కొండయ్య, కొడాలి అజయ్ కుమార్ పాల్గొన్నారు.



పెడనలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాము తదితరులు



ఘంటసాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మోపిదేవి ప్రధాన సెంటర్‌లో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మల్కాపట్నం గుప్తా సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

మోపిదేవి: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు మోపిదేవి ప్రధాన సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామ పార్టీ కన్వీనర్లు గరికిపాటి రేణుకయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు:మాజీ గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ నాయకులు మండలంలో ర్యాలీ నిర్వహించారు.

అవనిగడ్డ:మాజీ ఉపప్రధాన మంత్రి బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, జెడ్పీటీసీ చింతలపూడి వెంకటేశ్వరరావు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎస్సీసెల్ నాయకుడు గుర్రం బసవయ్య, నలుకుర్తి పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్:

స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ 8వ వార్డులోని జగజ్జీవన్‌రామ్, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

లంకపల్లి(ఘంటసాల): బడుగు బలహీన వర్గాల యువత డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ ఆశయాలతో ముందుకు సాగాలని మాజీ ఎంపీటీసీ నలుకుర్తి సురేష్ అన్నారు. ఘంటసాల మండలం లంకపల్లి ఇందిరా కాలనీలో డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నలుకుర్తి సురేష్, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని మాజీ ఎంపీటీసీ సురేష్ శనివారం ఆవిష్కరించారు.

ఘంటసాల: బాబూ జగజ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పలువురు వక్తలు తెలిపారు. ఘంటసాల మండలంలోని వివిధ గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలి గ్రామంలో జగజ్జీవన్ రామ్ విగ్రహానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుంటూరు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిట్టూర్పు పంచాయతీలో జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కొడాలి నాగార్జున, ఈవో ఎస్.శ్రీలక్ష్మీ కృష్ణవేణిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి శాస్త్రవేత్తలతో కలసి డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగురావుపాలెం, ఘంటసాల, ఘంటసాలపాలెం, చినకళ్లేపల్లి పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు రాచూరి ప్రసాద్ బాబు, బి.వెంకటేశ్వరమ్మ, దోనె రజని ఈవోలు, సిబ్బందితో కలసి బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగురావుపాలెంలో బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహానికి డాక్టర్ భానుమూర్తి, పైడిపాముల అశోక్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ఉపాధిహామి ఉద్యోగులు, సూరపనేనిపాలెంలో కొడాలి డేవిడ్ డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు

అట్టడుగు వర్గాల అభ్యుదయవాది జగ్జీవన్‌రామ్

కోనేరుసెంటర్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి మచిలీపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేర్ని కిట్టు పాల్గొన్నారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్‌సిలార్‌దాదాలతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ భారతజాతి గర్వించదగిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ దేశం కోసం పని చేసి ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, దళిత సంఘాల నాయకులు జక్కుల ఆనంద్‌బాబు, బేతపూడి రవి, బూరగ రామారావు, గూడవల్లి నాగరాజు, బందెల థామస్‌నోబుల్, చీలి చక్రపాణి, చీలి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఓగీస్‌పేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పేర్ని కిట్టు తదితరులు

సమతా వాదానికి పునాదులు వేసిన బాబు జగ్జీవన్‌రామ్

చిలకలపూడి(మచిలీపట్నం): సమాజంలో సమతా వాదానికి పునాది వేసిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ అని జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ అన్నారు. స్థానిక మల్కాపట్నంలోని సమీకృత వసతి గృహంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి కలెక్టర్ పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలోని లోటుపాట్లను సరిచేసిన అగ్రగణ్యులలో బాబు జగ్జీవన్ రామ్ ఒకరుగా నిలుస్తారన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఎంతో గొప్ప ప్రజా సేవ చేశారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ ఫణి ధూర్జటి, పర్యవేక్షకులు బాబురావు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల వేస్తున్న కలెక్టర్ డి.కె.బాలాజీ

శ్రీరామనవమికి చలువ పందిళ్లు సిద్ధం



సీతారామాంజనేయస్వామి ఆలయం విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం

పెడన:శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా ఆలయాల కమిటీలు చలువ పందిళ్లను సిద్ధం చేశాయి. పట్టణంతో పాటు మండలంలోని కోదండరామాలయాలు, హనుమాన్ దేవాలయాలు, వరసిద్ధి గణపతి సీతారాముల ఆలయాలను ముస్తాబు చేయడంతో పాటు పందిళ్లను వేసి కల్యాణం జరిపేందుకు అన్ని చర్యలు చేపడుతున్నారు. బస్టాండు సమీపంలోని గణపతి సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానం, 7, 8వ వార్డులలోని గుణ్ణాలపల్లిలోని కోదండరామాలయం, పాతకూరగాయల మార్కెట్ సమీపంలోని కేడీసీసీ బ్యాంకు పక్కన కోదండ రామాలయాలతో పాటు మండలంలోని పలు హనుమాన్ దేవాలయాలు వద్ద శ్రీరామనవమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపేందుకు ఆయా ఆలయాల కమిటీ వారితో పాటు స్థానిక పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై కూలిన తాటిచెట్లు

తెలుగురావుపాలెం(ఘంటసాల): పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వర్షానికి ప్రధాన రహదారిపై తాటిచెట్లు కూలిపోయాయి. ఆ చెట్లు విద్యుత్ వైర్లపై పడటంతో గ్రామంలో సుమారు రెండు గంటలు సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టి గ్రామంలో విద్యుత్తు ఇబ్బందుల్లేకుండా అందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 49 మంది లబ్ధిదారులకు రూ.21.65 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తం చెక్కులను ఆయా లబ్ధిదారులకు అందజేశారు.

శ్రీరామ కల్యాణ వేడుకలు ఆరంభం

భావదేవరపల్లి(నాగాయలంక): శ్రీరామ నవమి పర్వదినాలు సందర్భంగా మండలంలోని భావదేవరపల్లి పెద్ద ఊరు శ్రీరామ మందిరంలో అచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, బంద్రెడ్డి, బావిరెడ్డి ముత్తాల ఆధ్వర్యంలో తలపెట్టిన మూడు రోజుల సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవాలు శనివారం ఘనంగా ఆరంభమయ్యాయి. పెద్దిభట్ల భార్గవశాస్త్రి, వఝుల నాంచారయ్యశాస్త్రి బ్రహ్మత్వంలో తొలుత గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, దీక్షాధారణ, అఖండ స్థాపన తదుపరి సీతారాములును పెండ్లి కుమార్తె, పెండ్లి కుమారుడు చేసే కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. పూజాదికములలో పీటలపై సర్పంచ్, అలయ ధర్మకర్త మండలి ఉదయభాస్కర్–స్వర్ణ, వెంకట్రామ్–కృష్ణవేణి, వెంకట కాశేశ్వరరావు –విజయలక్ష్మి కూర్చున్నారు. గ్రామస్తులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఆదివారం సీతారామ కళ్యాణం, సోమవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సం, పూర్ణాహుతి, ఊరేగింపు, అన్నప్రసాద వితరణ ఉంటాయని నిర్వాహకులు చెప్పారు.



కల్యాణోత్సవాల్లో తొలిరోజు గోపూజ చేస్తున్న మూడు జంటలు